క్లుప్తంగా

దుకాణాల వద్ద డస్ట్‌బిన్‌లు తప్పనిసరి

• కమిషనర్ వికాస్‌మర్మత్



జీటీరోడ్డు దుకాణ యజమానికి సూచనలు చేస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు) : క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా దుకాణాల వద్ద డస్ట్‌బిన్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ వికాస్‌మర్మత్ కోరారు. నెల్లూరు ట్రంకురోడ్డులోని కిమ్స్‌హాస్పిటల్, ఎమ్‌జీబీ మాల్, కొండాయపాళెం రోడ్డు, ఏసీ స్టేడియం, ప్రభుత్వ ప్రధాన హాస్పిటల్, కరెంటాఫీసు కూడలి, వేదాయపాళెం మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను కమిషనర్ శుక్రవారం ఉదయం పర్యవేక్షించారు. డివిజన్ పరిధిలోని స్థానిక సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగర పాలక సంస్థ నిర్వహిస్తున్న డోర్ టు డోర్ చెత్త సేకరణలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించి మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలని కోరారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగర వ్యాప్తంగా అన్ని డ్రెయిన్లలో పూడికతీత పనులను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా పర్యవేక్షించాలని అధికారులు, సచివాలయాల శానిటేషన్ కార్యదర్శులను ఆదేశించారు.

సచివాలయాల తనిఖీ

స్థానిక 46/1, 3, దండువారివీధి, బృందావనం వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్‌మర్మత్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్షన్ రిజిస్టర్, నోటీసు బోర్డు, హాజరు, స్పందన రిజిస్టర్లతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. సచివాలయాల పరిధిలోని ప్రజలకు పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, మందుల పంపిణీ, రక్తపరీక్షలు తదితర సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, డీసీపీ దేవీకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి రివార్డులు



సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్) : అందరినీ ఆకట్టుకునేలా కవాతు నిర్వహించి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన ట్రాఫిక్, నవాబుపేట పోలీసుస్టేషన్ సిబ్బందిని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి అభినందించి రివార్డులు ప్రకటించారు. పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సిబ్బంది నిర్వహించిన కవాతును శుక్రవారం ఎస్పీ పరిశీలించి వారి నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సంక్షేమ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబ్బంది సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. పరిపాలనాపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, నగర, ఏఆర్, హోంగార్డ్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనతో వెలుగులు



నెల్లూరు(బృందావనం) : విశ్వకర్మ యోజన పథకంతో చేతివృత్తుల వారి జీవితాల్లో వెలుగులు నిండుతాయని విశ్వకర్మ కౌసల్య యోజన సెల్ జిల్లా కన్వీనర్ ఆర్కాట్ కుమార్ తెలిపారు. నగరంలోని గిడ్డంగివీధిలో ఉన్న ఆ సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వచ్చే సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించనుందన్నారు. కులవృత్తుల్లో నైపుణ్యం కోసం తొలి విడతగా రూ.లక్ష చొప్పున రుణం అందుతుందని, ఇందుకు నెలకు రూ.417 వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.500 చెల్లిస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత యంత్రాల కొనుగోలుకు రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందజేస్తారన్నారు. సమావేశంలో సింహపురి విశ్వకర్మ సంఘ గౌరవాధ్యక్షుడు రియాజ్ పాల్గొన్నారు.

దళిత రైతు, మైనార్టీ సంఘ జిల్లా అధ్యక్షుడిగా అశోక్

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఏపీ దళిత రైతు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా చింతల అశోక్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గంటగాని పేతూరు చేతుల మీదుగా నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అశోక్‌కుమార్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

ఆధ్యాత్మికత పరిఢవిల్లేలా..

నెల్లూరుకు కూతవేటు దూరంలో ఉన్న పదారుపల్లిలో ఆధ్యాత్మికత పరిఢవిల్లుతోంది. ఎంతో చరిత్ర కలిగిన పురాతన ఆలయాలను స్థానికులు సమష్టిగా అభివృద్ధి చేసుకున్నారు. దీంతో ఈ ప్రాంతంలో పలు ఆలయాల్లో నిత్యం దీప, దూప, నైవేద్యాలతో దేవతామూర్తులు పూజలందుకుంటున్నారు.

– నెల్లూరు రూరల్

• ఆలయాలకు నిలయంగా పదారుపల్లి
• దాతలు, గ్రామస్తుల సహకారంతో ఆలయాల అభివృద్ధి



కోదండరామస్వామి ఆలయం

చాలా ఏళ్ల క్రితం చిన్న పూరిపాకలో సీతారాములు, లక్ష్మణ, హనుమంతుని పటాలతో శ్రీరామనవమి ఉత్సవాలు జరిపేవారు. 40 ఏళ్ల క్రితం పూరిపాక స్థానంలో రామమందిరాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాలు, పూజలు చేసేవారు. కమలానందభారతి స్వామితో ఆలయ నిర్మాణానికి 2020లో శంకుస్థాపన చేశారు. ఏడాది కాలంలో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి విగ్రహ ప్రతిష్ఠ జరిపారు.

ఉత్సవాలకు సమష్టి తోడ్పాటు



ఎంతో చరిత్ర కలిగిన కోదండరామస్వామి ఆలయంలో ప్రతి ఏడాది శ్రీరామనవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తుంటారు. గ్రామస్తులందరూ సమష్టిగా ఉత్సవాలకు తోడ్పాటు అందిస్తారు.

– కొల్లూరు వీరేంద్రశర్మ, కోదండరామ స్వామి ఆలయ అర్చకులు



కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానం

1994లో పదారుపల్లిలో కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం జరిగింది. కలువాయి మండలం ముదిగేడుకు చెందిన దుద్దుగుంట కృష్ణారెడ్డి, రావమ్మ దంపతులు పదారుపల్లిలో స్థిరపడి ఈ ఆలయాన్ని నిర్మించి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఇక్కడి సమీప ప్రాంతాల భక్తులతో పాటు దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. ప్రస్తుతం వ్యవస్థాపక ధర్మకర్తలుగా దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి, సోమల శ్రీనివాసులురెడ్డి వ్యవహరిస్తున్నారు.

ఆలయాభివృద్ధికి కృషి



కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి అన్నివిధాలుగా కృషి చేస్తున్నాం. మా తల్లిదండ్రులైన కృష్ణారెడ్డి, రావమ్మ సంకల్పంతోనే ఆలయాన్ని నిర్మించాం. పర్వదినాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

– శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త



స్వామివారు



ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం

ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం

చెన్నకేశవస్వామి ఆలయాలు జిల్లాలో అరుదుగా ఉన్నాయి. పదారుపల్లిలో 2004లో ఈ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టగా 2007లో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. మూడేళ్ల క్రితం ఆలయ ఆవరణలో దాతల సహకారంతో కల్యాణ మండపం, భోజనశాల నిర్మాణం, పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రతి మే నెలలో స్వామివారికి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.





గంగమ్మతల్లి ఆలయం (ఇన్‌సెట్లో) , అమ్మవారు

గంగమ్మతల్లి దేవస్థానం

ఎంతో పురాతనమైన గంగమ్మ ఆలయం ఇటీవల జీర్ణోద్ధరణకు నోచుకుంది. తరతరాలుగా గ్రామదేవతగా గంగమ్మ తల్లి పూజలు అందుకుంటోంది. ప్రతి ఆదివారం ఆలయ ఆవరణలో భక్తులు పొంగళ్లు పెట్టుకుని నైవేద్యాలు సమర్పిస్తున్నారు. గ్రామ పరిరక్షణకు రాత్రివేళల్లో అమ్మవారు సంచరిస్తుంటారనే నమ్మకం స్థానికుల్లో ఉంది.



ఉమామహేశ్వరస్వామి ఆలయం

సుమారు 600 ఏళ్ల క్రితం ఉమామహేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించినట్లు చెబుతుంటారు. పాత ఆలయం శిథిలావస్థకు చేరడంతో నిత్య పూజలు దూరమయ్యాయి. దీంతో గుప్త నిధుల కోసం కొందరు శివాలయంలోని విగ్రహాన్ని పెకలించి సమీపంలోని చెరువులో పడేశారు. 2006లో ఆలయ జీర్ణోద్ధరణకు శ్రీకారం చుట్టారు. పాత పునాదుల పైనే ఆలయ నిర్మాణం చేపట్టారు. సమీపాన మహాగణపతి ఆలయం, దక్షిణాన ఆంజనేయస్వామి మండపం, ఉమాదేవి అమ్మవారి సన్నిధి ఉన్నాయి. ఈ ఆలయంలో కార్తీక మాసంతో పాటు మహాశివరాత్రి వంటి పర్వదినాల్లో విశేష పూజలు జరుగుతాయి.

సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం



చెక్కులను అందజేస్తున్న మంత్రి కాకాణి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): సర్వేపల్లి నియోజకవర్గంలో పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న మంత్రి క్యాంప్ కార్యాలయంలో పొదలకూరు, తోటపల్లిగూడూరు మండలాలకు చెందిన గిరిజన హౌసింగ్ లబ్ధిదారులకు రూ.15 వేల ఆర్థిక సహాయం చెక్కులను శుక్రవారం సాయంత్రం మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్టీ నిరుపేదలు ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వ సహాయంతో పాటు మరింత తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో లబ్ధిదారుకు అదనంగా రూ.15 వేలు సాయం చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా కాంట్రాక్టర్లను నియమించి ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో సుమారు 4,500 ఎస్టీ కుటుంబాలకు నగదు అందజేసి ఇళ్లు కట్టించి ఇవ్వడం తన ప్రధాన బాధ్యతగా మంత్రి పేర్కొన్నారు. మొత్తం 82 మంది గిరిజనులకు రూ.12.30 లక్షలను మంత్రి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో డీఈ బీవీ సత్యనారాయణరావు, ఏఈలు ముష్తార్‌బాషా, ఎం.శివమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్, విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతుందని నెల్లూరు టౌన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

• డైకస్‌రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని ఫత్తేఖాన్‌పేట, రమేష్‌రెడ్డినగర్, రైతుబజారు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది.
• తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలో ఏవీకే ఎస్టేట్, డైకస్‌రోడ్డు, జేజే కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఇందిరాగాంధీ నగర్, సంజయ్‌గాంధీనగర్, శాంతినగర్ ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది.
• వెంకటేశ్వరపురం పరిధిలో వెంకటేశ్వరపురం, జనార్దనరెడ్డికాలనీ, భగత్‌సింగ్ కాలనీ, గాంధీ గిరిజనకాలనీ, టిడ్కో గృహ సముదాయాల్లో ఉదయం 9 నుంచి 11 వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది.
• శెట్టిగుంటరోడ్డు పరిధిలోని కిసాన్‌నగర్, జాకీర్ హుస్సేన్‌నగర్, రాజీవ్‌గాంధీ కాలనీ, సింహపురి కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది.
• బీవీనగర్ పరిధిలో మాగుంట లేఅవుట్, డీమార్ట్ ప్రాంతం, రవీంద్రనగర్, ఎన్టీఓ కాలనీ, బీవీనగర్, లెక్చరర్స్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది.
• రామ్మూర్తినగర్ పరిధిలోని మినీబైపాస్‌రోడ్డు, అన్నపూర్ణ అపార్ట్‌మెంట్స్, బాలాజీనగర్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతుంది.

భారత రాజ్యాంగంపై అవగాహన సదస్సు



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని కృష్ణచైతన్య కళాశాలలో భారత రాజ్యాంగంపై జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ వేదిక జాతీయ నేత డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ దాదాపు 150 మంది విద్యార్థులకు భారత రాజ్యాంగ ఆవశ్యకత గురించి తెలియజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జేవీవీ నేత రమణారెడ్డి, కళాశాల డీన్ సుధారాణి, జేవీవీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

నరసింహకొండపై విశేష పూజలు



నెల్లూరు రూరల్ : దేవరపాళెంలోని నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆదిలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం పల్లకిసేవ జరిపారు. పలు ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ పాల్గొన్నారు.

రీజినల్ కౌన్సిల్ సెక్రటరీగా యండపల్లి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా సదరన్ రీజినల్ కౌన్సిల్ సెక్రటరీగా నెల్లూరుకు చెందిన యండపల్లి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. జూలై 12వ తేదీన ఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో 11 స్థానాలకు 24 మంది అభ్యర్థులు పోటీలో నిలువగా 2023–24 సంవత్సరానికి యండపల్లి శ్రీనివాసరావు ఎన్నికైనట్లు శుక్రవారం ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు.

కేన్సర్‌పై విద్యార్థులకు అవగాహన

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని వెంకటేశ్వరపురంలోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో కేన్సర్ వ్యాధిపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు కేన్సర్ ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ కేన్సర్ వ్యాధిని సకాలంలో గుర్తిస్తే నివారించవచ్చని, నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. ప్రధానంగా దూమపానం, మద్యపానం, పొగాకు ఉత్పత్తులు వాడే వారిలో ఈ వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. కేన్సర్‌పై అప్రమత్తతతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం

• నగరంలో ఐటీ కంపెనీలు ప్రారంభం



మాట్లాడుతున్న సీఈఓ మోహన్

నెల్లూరు సిటీ : జిల్లాలో నైపుణ్యం కలిగిన యువతీ, యువకులకు యూఎస్ ఐటీ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని నెక్స్‌జెరా, స్కిల్ బ్రిడ్జ్ సీఈఓ మోహన్ ఎగ్గోనీ పేర్కొన్నారు. నగరంలోని హరనాథపురంలో నెక్స్‌జెరా, స్కిల్ బ్రిడ్జ్ కంపెనీలను శుక్రవారం ఆయన తన తల్లిదండ్రులు వెంగళరెడ్డి, రమణమ్మతో కలిసి ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. నెక్స్‌జెరా కంపెనీలో ప్రాజెక్ట్‌లు చేస్తామన్నారు. ఒక్కడ పనిచేస్తూ నైపుణ్యం కలిగిన యువతను యూఎస్ ఐటీలో అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రతి ఆరు నెలలకు 600 మందికి స్కిల్ డెవలప్‌మెంట్ ఇచ్చి ఇతర దేశాల్లోని కంపెనీల్లో అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ రమ్య, మేనేజర్ అనుదీప్ పాల్గొన్నారు.

వస్తు సామగ్రి అందజేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని పుత్తా ఎస్టేట్‌లో ప్యూర్ స్మైల్ సేవా సంస్థ ఆధ్వర్యంలో అమెరికా ఆంధ్రా ముస్లిం అసోసియేషన్ సహకారంతో ఐదుగురు మహిళలకు టిఫిన్ సెంటర్ల ఏర్పాటు కోసం గ్రైండర్లు, స్టవ్‌లు తదితర సామగ్రిని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సేవా సంస్థ అధ్యక్షురాలు పర్వీన్, శరత్, కృష్ణకుమారి, రామానుజన్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై అశ్రద్ధ తగదు



కలెక్టర్, జేసీల సమీక్షలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• కలెక్టరేట్‌లో కావలి నియోజకవర్గ సమీక్ష

నెల్లూరు(దర్గామిట్ట) : రెవెన్యూ సమస్యలపై అశ్రద్ధ తగదని, వేగవంతంగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ నియోజకవర్గ అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టర్ చాంబర్‌లో కావలి నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలపై ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, జేసీ కూర్మనాథ్, ఆర్డీఓ శీనానాయక్ సమక్షంలో శుక్రవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి నియోజకవర్గంలోని రెవెన్యూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన సమస్యలను, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొచ్చినప్పుడు సత్వరమే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కరించే విధంగా వీఆర్వోలు, సర్వేయర్లకు తగిన ఆదేశాలు ఇవ్వాలని తహసీల్దార్లకు సూచించారు. అసైన్‌మెంట్ భూములకు సంబంధించి భూమి మీద ఉన్న వారికి నిబంధనల ప్రకారం పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలన్నారు. చుక్కల భూములను రెగ్యులరైజ్ చేసిన తరువాత నోషనల్ ఖాతా ఉంటే వాటికి సంబంధించిన ప్రతిపాదనలు ఈనెల 25లోగా పంపాలని సూచించారు. భూములకు సంబంధించిన కోర్టు కేసులుంటే ప్రభుత్వ ప్లీడర్ సహకారంతో కౌంటర్ దాఖలు చేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

నెల్లూరు(బారకాసు) : నగర నియోజకవర్గ పరిధిలో పలు సమస్యల పరిష్కారానికి సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ తాము చేపట్టిన ప్రజా పోరుయాత్ర 28 డివిజన్లలో పూర్తయిందని, ప్రజలందరినీ కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. అనంతరం మేయర్ స్రవంతికి అర్జీలను అందజేశారు. అంతకు ముందు బారాషహీద్ దర్గా నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు మస్తాన్‌బి, సూర్యనారాయణ, నరసింహ, కత్తి పద్మ, ప్రసాద్, శ్రీనివాసులు, సుబ్బమ్మ, వేణు, చిరంజీవి, శ్రీనివాసులురెడ్డి, నారాయణ, రఫీ, జాఫర్ పాల్గొన్నారు.

33వ డివిజన్‌లో మేయర్ పర్యటన

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలోని 33వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ మంజులనాయుడుతో కలిసి మేయర్ స్రవంతి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రెయిన్, కల్వర్టుల నిర్మాణాలను ప్రారంభించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అలాగే తాతయ్య బడి సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ప్రమాదాలు వాటిల్లకుండా కంచె ఏర్పాటు చేసేందుకు విద్యుత్‌శాఖాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. స్థానికంగా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

